సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 30 । జనవరి । 2024



చిరు ధాన్యం.. సిరి భోగం

ప్రతిఒక్కరూ ఆరోగ్యానికి అవసరమయ్యే పోష కాలు ఉన్న తిండిని తినడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. దీంతో చిరుధాన్యాల సాగు డిమాండ్ పెరిగింది. - 8లో



ఆంధ్రా జట్టు విజయభేరి

కడపలో జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు అండర్-23 మల్టీడేస్ అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. - 8లో

గరిష్టం/కనిష్టం
32.2/19.2

వాతావరణం

జిల్లాలో సోమవారం 19.2 – 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లా అదనపు ఎస్పీ తుషార్ డూడీ బదిలీ



కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా అదనపు ఎస్పీ(అడ్మి న్)గా పనిచేస్తున్న తుషార్ డూడీని గుంటూరు జిల్లా ఎస్పీగా నియమిస్తూ బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు సోమవారం రాత్రి ఉత్త ర్వులు జారీ చేశారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెం దిన ఈయన చింతపల్లిలో ఏఎస్పీగా పనిచేస్తూ 2022 సెప్టెంబర్ 5న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా విధుల్లో చేరారు.

బ్యాడ్మింటన్ ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరులోని జార్జ్ కారొనేషన్ క్లబ్‌లో సోమవారం వైఎస్సార్ డి స్టిక్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ ఎంపికలు నిర్వహించారు. 35 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 150 క్రీడా కారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరు ఫిబ్రవరి 16 నుంచి 18 వరకు రాజమం డ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొం టారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్ రెడ్డి, చైర్మన్ జిలానిబాషా మాట్లాడుతూ నిత్యం క్రీడాసాధన చేసి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగా లన్నారు. బ్యాడ్మింటన్ రెఫరీ నాగరాజు, అసోసియేషన్ సభ్యులు మధుసూధన్‌రెడ్డి, రాం మనోహర్‌రెడ్డి, సుబ్బరాయుడు, అనిల్, సోనిశ్యామూల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏపీఈఆర్‌సీ వార్షిక ధరలపై అభ్యంతరాల స్వీకరణ

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియం త్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) 2024- 25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వినియోగదారుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. సోమవారం కడపలోని విద్యుత్ భవన్‌లో మొదటి రోజు బహిరంగ విచారణకు ఏపీఎస్‌పీడీసీఎల్ ఓఎస్‌డీ ఎన్. శ్రీనివాసులు, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ, కడప డివిజన్ ఈఈ ఎల్. నరసింహ ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదోని యంత్రణ కాలానికి(2024–25 నుండి 2028–29 వరకు) ప్రతిపాదించిన పంపిణీ వ్యాపారానికి ఆదాయ అవసరాలు, వీలింగ్ ధరలపై బహిరంగ విచారణ నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలిరోజు ముగిసేసరికి వైఎస్ఆర్ జిల్లా పులివెం దుల బొనాల నుంచి రమణారెడ్డి తన అభ్యంత రాలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మం డలి వారికి తెలియచేశారు.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదదారులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ


కడప అర్బన్ : బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు తుషార్ డూడీ 'స్పందన'కా ర్యక్రమం నిర్వహించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన'ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత సమయంలో వాటిని పరిష్క రించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

హౌసింగ్ పెండింగ్ పనులను పూర్తిచేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : పేదలందరికీ ఇళ్లు.. కార్యక్ర మంలో భాగంగా జగనన్న కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ పనులను సంపూర్తి చేయాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశిం చారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లో వివిధ పథకాలకు సంబంధించిన పనుల పురోగతిపై.. జేసీ గణేష్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చం ద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీ ఆర్వో గంగాధర్ గౌడ్, హౌసింగ్ పీడి కృష్ణయ్య లతో కలిసి క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద లందరికీ ఇళ్లు పథకంలో భాగంగా.. జగనన్న హౌసింగ్ లే అవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణా లను ఇప్పటికే మొదటి దశలో పూర్తి చేసి గృహ ప్రవేశాలు కూడా చేయడం జరిగిందని, అదే స్ఫూర్తితో మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జగ నన్న హౌస్ సైట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లాలో వంద శాతం పూర్తి చేయాలన్నారు.

ఉన్నట్టా... లేనట్టా!

- సీటు తేడా కొడితే టీడీపీకి పనిచేస్తారా..?
- టికెట్ ధీమాతో ఆ నలుగురు నియోజకవర్గ ఇన్‌చార్జీలు
- ప్రొద్దుటూరు, రాయచోటి, కడప, కమలాపురంపై అంతర్మథనం



సాక్షి ప్రతినిధి, కడప: ఎన్నికల నోటిఫికేషన్ రాకున్నా అధికార వైఎస్సార్‌సీపీ దూకుడుగా అభ్యర్థులను ప్రకటిస్తోంది. అభ్యర్థుల ప్రకటనపై టీడీపీ అంతర్మ థనంలో ఉంది. నియోజకవర్గ ఇన్‌చార్జీలకు టికెట్ దక్కకపోతే, టీడీపీకి పనిచేస్తారా? లేదా? అన్న సం దిగ్ధత ఆ పార్టీలో కొనసాగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో నాలుగు చోట్ల అలాంటి పరిస్థితే ఉంది. మెరుగైన అభ్యర్థులు లభించి, సీన్ మారితే రివర్స్ గేర్ అందుకుంటారా అన్న అనుమానం లేక పోలేదు. వెరశి వీళ్లకు టికెట్ ఉన్న ట్టా...లేనట్టా...అన్న సందేహం లేకపోలేదు. అపార ప్రజామద్దతు, విజయావకాశాలను బేరీజు వేసుకొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ప్రకటి స్తోంది. అలాంటి ధీమా తెలుగు దేశం పార్టీలో కనిపంచడం లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జీలతో పార్టీ కార్యక్రమాలు కొనసాగించడం మినహా వారే అభ్యర్థులని ప్రకటిం చడం లేదు. ఇటీవల రా...క దలిరా కార్యక్రమంలో కూడా తెలుగుదేశం పార్టీని గెలిపించాలని అధినేత చంద్రబాబు అభ్యర్థించారే తప్ప, అభ్యర్థులుగా వీరి విజయానికి కృషి చేయాలని పేర్లు చెప్పలేకపోయారు. ఏక నాయకత్వం ఉన్న నియోజకవర్గాల్లో కూడా అదే దాటవేత ధోరణినే అవలంభించారు. అందుకు కారణం లేకపోలేదు. ఇప్పుడున్న వారి కంటే మెరుగైన అభ్యర్థి కోసం టీడీపీ అన్వేషిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే సింగిల్ నాయకత్వం ఉన్న చోట కూడా అభ్యర్థిగా ప్రకటించలేకపోతున్నారని విశ్లేషకులు చెప్పుకొస్తున్నారు.

ఆ నాలుగు చోట్లా సంకటమే...

తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు తర్వాత జిల్లా నేతల మధ్య సర్దుబాటు సాధ్యమా తుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల ఉండిపో యింది. కడప నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాధవీ రెడ్డి నియామకం అయ్యాక, ఆమె పార్టీ కార్యక్ర మాలు చురుగ్గా చేపడుతు న్నారు. తనకే టికెట్ అన్న ధీమాతో జనంలోకి వెళ్తున్నారు. కాగా 2019లో పోటీచేసిన మైనార్టీ నేత అమీర్ బాబు, 2014లో పోటీచేసిన దుర్గాప్రసాద్, ప్రస్తుతం టికెట్ ఆశి స్తున్న కార్పొరేటర్ ఉమాదేవి (జిల్లా పరి షత్ మాజీ వైస్ చైర్మన్‌ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కోడలు) ఒక జట్టుగా పార్టీ కార్యక్రమాలు చేపడుతు న్నారు. మాధవీరెడ్డికి టికెట్ కేటాయిస్తే వీరంతా సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల రా..కదలిరా కార్యక్రమానికి హాజరైన చంద్రబా బుతో కార్పొరేటర్ ఉమాదేవి గెలిచే వారికే టికెట్ ఇవ్వండి సార్..అంటూ బాహాటంగా కోరడం విశే షం. వైరి పక్షాన్ని కలుపుగోలుగా వెళ్లలానే ఆలోచన ఇన్‌చార్జి మాధవీరెడ్డిలో కూడా కన్పించడం లేదని పరిశీలకుల భావిస్తున్నారు. అదే సమయంలో మాధవీరెడ్డికి సహకరించే పరిస్థితి ఆ ముగ్గురు నాయకుల్లో కనిపించడం లేదని పలువురు అభిప్రా యడుతున్నారు.

ప్రొద్దుటూరు అభ్యర్థిత్వాన్ని ప్రకటించుకున్న ప్రవీణ్...

ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి టికెట్‌పై ధీమాగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లెల లింగారెడ్డిలతో పాటు, రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్‌లు కూడా టికెట్ ఆశి స్తున్నారు. ఈ నలుగురిలో చినబాబు ప్రవీణ్ వైపు మొగ్గు చూపుతుండగా, పెద్దబాబు డైలమాలో ఉన్నారు. ఒకరికిస్తే కనీసం ఇద్దరు విబేధించే పరిస్థితి లేకపోలేదు. అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే అంతంత మాత్రపు పోటీ ఇవ్వగలరని, ఇలాంటి పరిస్థితిలో ఏకాభిప్రాయం ఎలా సాధించా లనే సందిగ్ధత టీడీపీలో కనిపిస్తోందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కాగా సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలో టీడీపీ అభ్యర్థిగా గండ్లూరు ప్రవీణ్‌కు మార్‌రెడ్డి తనకు తానుగా పోస్టర్లు వేసుకున్నారు. ఈవ్యవహారంపై అటు మాజీ ఎమ్మెల్యే వరద వర్గీ యులు, ఇటు లింగారెడ్డి తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. ఏకపక్షంగా అభ్యర్థిగా ప్రకటించుకోవడం ఏమిటని నిలదీస్తున్నారు. ప్రొద్దుటూరు టీడీపీలో తాజాగా అభ్యర్థిత్వం అగ్గి రాజుకుంది. ఎటు వైపు దారి తీస్తుందో వేచి చూడాల్సిందేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

పుత్తా పేరు ఎత్తని చంద్రబాబు...

కమలాపురం కేంద్రంగా ఈనెల 19న రా...కదలిరా కార్యక్రమాన్ని చంద్రబాబు చేప ట్టారు. అక్కడి నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నర సింహారెడ్డిని ఈ మారైనా గెలిపించాలని అధినేత చంద్రబాబు సూచించకపోవడం చర్చనీయాంశ మైంది. వరుసగా నాలుగు సార్లు ఓటమి పాలైన పుత్తా స్థానంలో మరెవ్వరినైనా దింపాలనే ఆలో చనలో చంద్రబాబు ఉన్నారా? ఆ కారణంతోనే పుత్తా పేరు ప్రకటించలేదా? మెరుగైన అభ్యర్థి లభించి తెరపైకి తీసుకువస్తే పుత్తా సహకరి స్తారా? అనే సందేహం కూడా టీడీపీని వెంటాడు తున్నట్లు సమాచారం. ఈక్రమంలో పుత్తాకు తెలి యకుండానే కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశి వారెడ్డిని తాజాగా టీడీపీలో చేర్చుకున్నారు. ఇక్కడ కూడా టికెట్ విషయంలో ప్రతిష్టంభన ఏర్పడింది. అదే పరిస్థితి రాయచోటిలో ఉంది. ప్రస్తుత ఇన్‌చార్జి రమేష్‌కుమార్‌రెడ్డి 2014, 19ల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఈమారు టికెట్ తనకే లభిస్తుందనే ధీమాతో ఉన్నారు. కాగా ఇటీవల టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసీ ప్రసాద్‌బాబు కూడా టికెట్ ఆశిస్తున్నారు. గడికోట ద్వారకా నం దమూరి కుటుంబంతో ఉన్న బంధుత్వం (దివం గత నందమూరి తారకరత్న) కారణంగా తనకే టికెట్ లభిస్తుందనే భావనతో వర్గ సమీకరణ దిశగా అడుగులు వేస్తున్నారు. మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి కూడా ఈమారు టికెట్ దక్కుతోందనే ధీమాగా ఉన్నారు. వీరిలో ఒక్కరికి టికెట్ లభిస్తే, మరొకరు సహకరించే పరిస్థితి కన్పించడం లేదని పరిశీలకుల అంచనా. ఇలాంటి పరిస్థితి నుంచి ఎలా గట్టెక్కాలనే ఆలోచనలో టీడీపీ ఉండిపో యిందని పలువురు చెప్పుకొస్తున్నారు.

బీసీల హక్కుల కోసం పార్లమెంట్‌పై దండయాత్ర



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య

కడప సెవెన్‌రోడ్స్ : బీసీల హక్కుల సాధన కోసం పార్లమెంట్‌పై దండయాత్ర సాగిస్తామని వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృ ష్ణయ్య అన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 18వ రాష్ట్ర మహాస భల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డారు. స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలైనా బీసీలకు రాజ్యాంగ బద్ధ హక్కులు లేవన్నారు. జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నా ఉద్యోగాల్లో 16 శాతం ఉన్నారని పేర్కొన్నారు. అనేక పోరా టాల ఫలితంగా ఐఐటీ, ఐఐఎంలలో రిజర్వేషన్లు సాధించినప్పటికీ ఫీజులు, మెయింటెన్స్ చార్జీలు చెల్లించలేని పరిస్థితుల్లో బీసీలు ఉన్నారని తెలి పారు. మన రాష్ట్రం కంటే కర్ణాటక, ఒరిస్సా, చత్తీ స్ఘడ్, బీహార్ తదితర రాష్ట్రాల్లో పరిస్థితి దారు ణంగా ఉందన్నారు. బ్యాంకులు, రైల్వేల్లో కొద్ది ఉద్యోగాల్లో మాత్రమే బీసీలు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ శాఖలోని ఏఈలలో 60 శాతం బీసీలు ఉండడం ముదావహమన్నారు. కేంద్రంలో 97 మంది సీనియర్ సెక్రటరీలు ఉం టే, అందులో ముగ్గురే బీసీలు ఉన్నారని పేర్కొ న్నారు. అందుకే బీసీలకు పదోన్నతుల్లో రిజర్వే షన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతికి పెద్దపీట వేయడం ద్వారా దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరభద్రయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మా ట్లాడుతూ బీసీలకు క్రీమీలేయర్ ఎత్తివేయాలని కోరారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ చిన్నబాబు, రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, శ్రీరామచంద్ర మూర్తి, గంగాధర్‌రావు, చలపతి, విశ్వరూపాచా రి, పుల్లయ్య, శ్రీకాంత్ మాట్లాడారు.

కబడ్డీ పోటీలో ఆంధ్ర జట్టు విజయం

రాజంపేట టౌన్ : రాజంపేటలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సోమవారం ఆంధ్ర జట్టు రెండో లీగ్ మ్యాచ్ సీఐఎస్‌సీఈ జట్టుతో తలపడి విజయం సాధించింది. ఫస్ట్ హాఫ్ ముగిసె సరికి రెండు జట్ల మధ్య కేవలం రెం డు పాయింట్లు మాత్రమే తేడా ఉంది. అయితే సెకండ్ హాఫ్‌లో ఆంధ్ర జట్టు క్రీడాకారులు మెరుగైన ఆట తీరును ప్రదర్శించి తొమ్మిది పాయింట్లతో విజయం సాధించారు. ఈమ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 54, సీఐఎ స్‌సీఈ జట్టు 45 పాయింట్లు చేసింది. రెండో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు గెలవడంతో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌పై ఆశలు చిగురించాయి. కాగా ఈరోజు ఢిల్లీ రెం డు లీగ్ మ్యాచ్‌లను ఆడింది.గుజరాత్‌పై ఆడిన మ్యాచ్‌లో ఢిల్లీ 4 పాయింట్లతో విజయం సాధించగా, మధ్యప్రదేశ్‌తో తలపడిన మ్యాచ్ టైగా ముగిసింది. బీహార్-విద్యాభారతి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బీహార్ నాలుగు పాయింట్లతో విజయం సాధించింది. వెస్ట్ బెంగాల్‌పై పంజాబ్ ఐదు పాయింట్లతో, జమ్ము కాశ్మీర్‌పై తమిళనాడు 63 పాయింట్లతో, చత్తీస్‌గడ్‌పై కేరళ 34 పాయింట్స్‌తో, కర్ణాటక పై హర్యానా 66 , కేవీఎస్ జట్టుపై విద్యాభారతి జట్టు 11 పాయింట్స్‌తో, ఎస్‌వీఎస్ జట్టుపై ఉత్తరప్రదేశ్ 5 పాయింట్లతో, ఉత్త రాఖాండ్‌పై చత్తీస్‌గడ్ 34 పాయింట్లతో, రాజస్థాన్‌పై హర్యానా 33 , ఉత్తరప్రదేశ్‌పై మహారాష్ట్ర 4 పాయిం ట్లతో విజయం సాధించింది. కబడ్డీ పోటీల సంద ర్భంగా మంగళవారం రాత్రి 7 గంటల నుంచి క్యాంప్ ఫైర్‌ను నిర్వహించనున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర సెక్రటరి జి.భానుమూర్తిరాజు తెలిపారు.



తలపడుతున్న క్రీడాకారులు

అర్జీలను సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా అందే ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్ట ర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీ ఆర్వో గంగాధర్ గౌడ్, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఎన్నికలకు ముందస్తుగా సన్నద్ధం కావాలి

రానున్న ఎన్నికలకు అధికారులందరూ సన్నద్ధం కావాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని వీసీ హాలులో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, మున్సి పల్ కమిషనర్ సూర్య ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, ఏఎస్పీ తుషార్ దూడి, లతో కలిసి వచ్చే సాధారణ ఎన్నికల నిర్వహణపై ఆయా నియో జకవర్గాలకు సంబంధించిన ఈఆర్వోలు,నోడల్, పోలీస్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రానున్న ఎన్నికలను పురస్కరించుకొని ఇప్ప టికే ఈఆర్వోలు, నోడల్ అధికారులకు విధులను కేటా యించామన్నారు. వీటిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను రూపొందించి తనకు పంపించాల్నారు. ఎన్నికల నిర్వ హణలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికా రులకు కేటాయించిన విధులను నిబంధనల ప్రకారం చేపట్టాల్సి ఉంటుందని అన్నారు. ఈ మేరకు అధికా రులు ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.పోలింగ్ రూట్‌లను, పోలింగ్ కేంద్రాలను ఫిజికల్‌గా వెళ్లి పరిశీలించాలన్నారు. మార్చిలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల దృష్ట్యా ఎన్నికల ట్రైనింగ్ సెంటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యా శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. జిల్లాలోని సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడప, జ మ్మలమడుగు,బద్వేల్,పులివెందుల ఆర్డీవోలు మధు సూదన్ శ్రీనివాసులు,వెంకట రమణ,వెంకటేశం, డి ప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అ. ధికారి ప్రభాకర్‌రెడ్డి,బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఈవో రాఘవరెడ్డి,జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జేడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రవాసాంధ్రుల నేస్తం ఏపీఎన్ఆర్‌టీఎస్

ప్రభుత్వ సహకారంతో ఆరేళ్లుగా విస్తృత సేవలు

సాక్షి, కడప డెస్క్: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు అసోసియేషన్ (ఏపీ ఎన్ఆర్‌టీఎస్) ప్రవాసాంధ్రులకు ప్రియమైన నేస్తంగా మారింది. 2018లో ఏర్పడిన ఈ సంస్థ ఈ ఆరేళ్ల కాలంలో గల్ఫ్ దేశాలైన కువైట్, ఖత్తర్, సౌదీ అరేబియా, దుబాయ్‌లలో ఇబ్బందులు పడుతున్న ప్రవాసాం ధ్రులకు అండగా నిలిచింది. వారి అవసరాలు తీర్చింది. గతంలో ఈ సంస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా, అధ్యక్షులుగా ఎస్.వెంకట్ మేడపాటి ఉండేవారు. ప్రస్తుతం గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా ఉప ముఖ్య మంత్రి అంజద్‌బాషాను నియమించారు. గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు ఎవరైనా గాయపడినా, మరణించినా, వైకల్యం పొందినా అక్కున చేర్చుకుని వారికి ఆపన్నహస్తం అందిస్తోంది. పాస్ పోర్టు పోగొట్టుకుని వీసా గడువు తీరిపోయి కేసు లతో సతమతమవుతున్న వారిని గుర్తించి సాయం చేసి స్వదేశానికి రావడానికి ఎయిర్ టిక్కెట్లతో పాటు ఇమిగ్రేషన్ జరిమాన, దారి ఖర్చులను కూడా ఇప్పిస్తున్నారు. టెంపుల్ దర్శన్ పేరుతో రాష్ట్రంలో ప్రసిద్ధ దర్శనీయ దేవాలయాలకు బ్రేక్ దర్శనం చేయిస్తున్నారు. ప్రవాసాంధ్రుల సమస్య లను గుర్తించడానికి 24 గంటలు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి గ్రీవెన్సెస్ స్వీకరిస్తున్నారు. ఏపీఎస్ ఆర్ఐ సెల్ ద్వారా వివాహ సమస్యలు, ఏజెంట్లు మోసం చేయడం, కోర్టు కేసులు వంటి వాటిని పరి ష్కరిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కింద నిరు ద్యోగులకు శిక్షణ ఇవ్వడంతోపాటు యూఎస్ఏ, యూకేలకు వెళ్లే వారికి ఆన్‌లైన్ ఐటీ ట్రైనింగ్స్ కూడా ఇస్తున్నారు. విదేశాల్లో ఉంటూ సొంత ఊరిని అభివృద్ధి చేయాలనుకునే వారి కోసం మై గ్రాంట్ రీసోర్స్ సెంటర్స్ ఏర్పాటు చేసి వారి గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సహక రిస్తున్నారు. గల్ఫ్ దేశాలకు లీగల్‌గా, భద్రతగా వెళ్లడం ఎలా? ఏయే దశల్లో మోసాలు జరుగుతు న్నాయనేదానిపై విదేశాలకు ఎక్కువగా వెళుతున్న ప్రాంతాల్లో సేఫ్ మైగ్రేషన్ క్యాంపులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. విదేశాల్లో చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం స్టూడెంట్ కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వారు ఏ కోర్సుల్లో చేరద లుచుకున్నారు? డాక్యుమెంటేషన్, వీసీ గైడ్ లైన్స్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. విద్యావంతులైన ఎన్ఆర్ఐలను బృందాలుగా ఏర్పాటు చేసి ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం సంపాదించేందుకు దోహదప డుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే 10వ తర గతి, ఇంటర్ విద్యార్థుల కోసం స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు చేయిస్తున్నారు. ఐటీ కంపెనీల్లో ఉద్యో గాల కల్పనతోపాటు ఇండస్ట్రియల్ ఎలక్ట్రిషియన్ ట్రైనింగ్ ఇస్తున్నారు. యూఎస్ఏలోని డ్రిస్టిక్ స్కూళ్లకు ఇక్కడి నుంచి 52 మంది టీచర్లను పం పించారు. గల్ఫ్‌లో మృతి చెందిన వారి మృతదే హాలను భారతదేశానికి తీసుకు రావడానికి థర్డ్ పార్టీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రవాసాం ధ్ర భరోసా బీమా ద్వారా వలస కార్మికులకు తక్కువ ప్రీమియానికే రూ. 10 లక్షల బీమా, రూ. లక్ష వరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కల్పిస్తు న్నారు. మహిళలు గర్భధారణ చేస్తే సాధారణ డెలి వరీకి రూ. 35 వేలు, సిజేరియన్‌కు రూ. 50 వేలు అందేలా చర్యలు చేపడుతున్నారు. ఏవైనా లీగల్ సమస్యలు ఉంటే వాటి పరిష్కారం కోసం రూ. 45 వేలు ఇప్పిస్తున్నారు.





కరోనా సమయంలో విదేశాల నుంచి ఇండియాకు తీసుకొచ్చిన ప్రవాసాంధ్రులకు ఆహార పదార్థాలను అందజేస్తున్న ఏపీ ఎన్ఆర్‌టీఎస్ సభ్యులు

పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌కు తొలగిన అడ్డంకులు

గల్ఫ్‌లో ఎన్ఆర్ఐలు గతంలో పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్(పీసీపీ) పొందాలంటే చాలా కష్టత రంగా ఉండేది. అందుకోసం పాస్‌పోర్టుతో పాటు వీసా, అగ్రిమెంట్ సమర్పిస్తే 45 రోజుల తర్వాతగానీ పీసీసీ వచ్చేది కాదు. ఆ లోపు వీసా టైం అయిపోవడమో, పాస్‌పోర్టు గడువు మీరిపోవడమో జరిగేది. ఏపీఎన్ఆర్‌టీఎస్ కేం ద్ర ప్రభుత్వ పాస్‌పోర్టు అధికారులకు ఈ సమ స్యలన్నీ వివరించి కేవలం పాస్‌పోర్టుతో దరఖాస్తు చేస్తే మరుసటి రోజే అపాయింట్ మెంట్ లభించేలా కృషి చేశారు. వారంలోనే ఇప్పుడు పీసీసీ వచ్చేస్తోంది. ప్రతి శనివారం వాక్ ఇన్ డ్రైవ్ నిర్వహిస్తూ సర్టిఫికెట్లు జారీ చేస్తు న్నారంటే అది ఏపీఎన్ఆర్‌టీఎస్ ఘనతగానే చెప్పవచ్చు.

- కోవిడ్ మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయం లో కూడా ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యులు ప్రభుత్వ అధికారులతో కలిసి సేవలందించారు. వివిధ దేశాల నుంచి స్వదేశానికి వచ్చిన వారికి విమా నాశ్రయాల్లో త్రాగునీరు, భోజనం, స్నాక్స్, జ్యూసులు ర్పాటు చేశారు. మరే రాష్ట్రంలోనూ ఈ తరహా సేవలు అందించలేదు.

సీఎం సహకారం మరువలేనిది



ఏపీఎన్ఆర్‌టీఎస్ స్థాం పించిన తర్వాత ఏడా దికి వైఎస్సార్‌సీపీ అధి కారంలోకి వచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి గల్ఫ్‌దేశాల్లో తెలుగువారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తమ సంస్థకు ప్రోత్సా హం అందించారు. అనేక సమస్యలతో సతమ తమవుతూ సరియైన వేతనాలు లేక మగ్గిపో తున్న వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసు కురావడంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎంతో కృషి చేశారు.
– ఎస్.వెంకట్ మేడపాటి, చైర్మన్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



ప్రవాసాంధ్రుల సమస్య లను గతంలో ఏ ప్రభు త్వాలు పట్టించుకోలేదు. వారు పడుతున్న అవ స్థలను తీర్చే ఆలోచన కూడా చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ప్రవాసాంధ్రుల సమ స్యలపై ప్రత్యేక చొరవ ప్రదర్శించారు. కోవిడ్ సమయంలో ఎంతో మందిని ప్రత్యేక విమా నాల ద్వారా ఇండియాకు రప్పించేందుకు కృ షి చేశారు. పాస్‌పోర్టులు, వీసా లేకుండా ఉం టున్న వారిని, ఎవరూ లేక అనాథలుగా చని పోయిన వారిని ఇండియాకు తీసుకురావడం లో ప్రభుత్వ సహకారం మరువలేనిది.
–బీహెచ్ ఇలియాస్,డైరెక్టర్, ఏపీఎన్ఆర్‌టీఎస్

తండ్రి కళ్లెదుటే తనయుడి దుర్మరణం


మృతి చెందిన కార్ల విశ్వం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామ పరిధిలో ఐసీఎల్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. తండ్రితో పాటు బైకుపై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో కార్ల విశ్వం (16) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రగుంట్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిలంకూరు గ్రామంలో నివాసం ఉండే కార్ల రవి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం బైకుపై రవి తన కుమారుడు విశ్వంను కూర్చోబెట్టుకుని పెట్రోల్ కోసం వెళ్లాడు. రోడ్డును క్రాస్ చేస్తుండగా ముద్దనూరు వైపు నుంచి లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న రవి కింద పడి తప్పించుకున్నాడు. వెనుక కూర్చున్న విశ్వం లారీ కింద పడి మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చిరు ధాన్యం.. సిరి భోగం

- జిల్లాలో ఆశాజనకంగా చిరుధాన్యాల సాగు
- లక్ష్యం 20 వేల ఎకరాలు.. సాగు 23,228 ఎకరాల్లో
- జొన్న, రాగులకు మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం
- పౌరసరఫరాల శాఖ ద్వారా జొన్నల కొనుగోలు ప్రారంభం



కడప అగ్రికల్చర్ : ఆధునిక పోకడలతో మనిషి జీవితం యాంత్రికంగా మారింది. నిత్యం పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారు. తీరిక లేకుండా బిజీగా గడుపుతూ వేళ కాని వేళ దొరికిన తిండి తినేందుకు అలవాటు పడి జనం జీవన పంథాను మార్చుకున్నారు. దీంతో చాలా మంది అనారోగ్యం బారిన పడి బాధపడుతున్నారు. ఫలితంగా వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలు ఉన్న తిండిని తినడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. దీంతో చిరుధాన్యాల సాగు డిమాండ్ పెరిగింది. దీనికి అనుగుణంగా చాలా మంది రైతులు చిరు ధాన్యాల సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. దీనికి ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది. పైగా మద్దతు ధరను కూడా ప్రకటించి రైతులు పండించిన దిగుబడులను పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపింది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో చాలా మంది రైతులు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జొన్న, కొర్ర, సజ్జ, రాగి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం జొన్న పంటలకు మద్దతు ధరను కూడా ప్రకటించి జిల్లాలో జొన్నల కొనుగోలును ప్రారంభించింది.

అవగాహన సదస్సులతో సత్ఫలితం

మూడు, నాలుగు దశాబ్దాల క్రితం పేద, మధ్య తరగతి ప్రజల ప్రధాన ఆహారంగా చిరుధాన్యాలే ఉండేవి. వీటికి రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం పశువుల ఎరువు, చెరువు మట్టి, సేంద్రియ ఎరువులతో పండించే వాళ్లు. వీటిని వాడే ప్రజలు ఆరోగ్యంగా ఉండటంతోపాటు వారిలో రోగ నిరోధక శక్తి కూడా అధికంగానే ఉండేది. క్రమేపీ వచ్చిన మార్పులతో ఏడాదికేడాది చిరుధాన్యాల సాగు తగ్గిస్తూ అధిక ఆదాయం కోసం వాణిజ్య పంటలసాగు పెంచుకుంటూ వచ్చారు. ఫలితంగా చిరు ధాన్యాల సాగు కనుమరుగై పోతూ వచ్చింది. వీటితోపాటు అధిక దిగుబడులను సాధించాలనే పోటీ తత్వంతో రైతులు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుమందులు వాడటం మొదలు పెట్టారు. దీంతో సాగు ఖర్చులు పెరిగి పంట దిగుబడులు తగ్గడంతోపాటు భూమి కూడా విషతుల్యంగా మారుతోంది. ఈ నేపథ్యంలో 2023 ఏడాదిని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులు పండించే జొన్న, రాగి పంటలకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు మద్దతు ధరను ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా నియోజక వర్గాల వారిగా వ్యవసాయ అధికారులు మిల్లెట్ సాగుపై అవగాహన సదస్సులను నిర్వహించారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో జొన్న, కొర్ర, సజ్జ, రాగి పంటల సాగు పెరిగింది. దీనికితోడు జొన్న, రాగి పంటలకు మద్దతు ధరను ప్రకటించి ప్రోత్సహిస్తోంది. అలాగే వీటి దిగుబడులను కూడా సులభంగా అమ్ముకునేందుకు వీలుగా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తూ పౌరసరఫరాశాఖ ద్వారా కొనుగోలును ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో జొన్నల కొనుగోలును ప్రారంభించారు.

20 వేల ఎకరాల సాగు లక్ష్యంగా..

జిల్లాలో మిల్లెట్స్ సాగును ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా 2023 ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 20 వేల ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే లక్ష్యంగా వ్యవసాయ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో 6660 ఎకరాల్లో జొన్న, 5125 ఎకరాల్లో సజ్జలు, 4500 ఎకరాల్లో రాగి, 4680 ఎకరాల్లో కొర్రలు సాగు లక్ష్యంగా నిర్దేశించారు. అయితే 23,228 ఎకరాల్లో జొన్న, కొర్ర, సజ్జ, రాగి పంటలు సాగు చేసి లక్ష్యాన్ని అధిగమించారు.

మద్దతు ధరలు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం మిల్లెట్స్ సాగును ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా జొన్న, రాగులకు మద్దతు ధరను కూడా ప్రకటించింది. ఇందులో భాగంగా హైబ్రీడ్ జొన్నలకు క్వింటాల్‌కు రూ. 3180 కాగా సాధారణ జొన్నకు క్వింటాల్‌కు 3225, అలాగే రాగులకు క్వింటాల్‌కు రూ. 3846గా ప్రకటించింది.

సాగు లక్ష్యం అధిగమించాం



పంటల సాగులో రైతులకు అధిక ఖర్చును తగ్గించి తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి వచ్చే పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో 20 వేల ఎకరాల మిల్లెట్స్ సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించాం. అయితే మేము నియోజక వర్గాల వారిగా ఆర్‌బీకేల పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తూ లక్ష్యానికి మించి 23,228 ఎకరాల్లో సాగును చేపట్టాము.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

నెరవేరిన సొంతింటి కల



మాకు ఇప్పటి వరకు నివాసం ఉండేందుకు ఇల్లు లేదు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలో నా పేరు మీద ఇంటి స్థలం కేటాయించి ఇల్లు కూడా కట్టించి ఇచ్చారు. గతంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. మా వలంటీర్ ద్వారా స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. సొంతింటి కల నెరవేరడంతో చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది.

- లింగంగుంట బుజ్జమ్మ, బ్రాహ్మణపల్లె, గోపవరం మండలం

సులభంగా ధ్రువీకరణ పత్రాలు



గతంలో కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు కావాలంటే కార్యాలయాలు, మీసేవ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టడంతో కుల, ఆదాయ ధ్రువీకరకణ పత్రాలు కావాలని గ్రామ వలంటీర్‌కు తెలియజేశాము. నావద్ద ఆధార్, రేషన్ కార్డులు తీసుకొని కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సులభంగా అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాము.

- బోడా సరస్వతి, ఉప్పరపల్లి, సిద్దవటం మండలం

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి



ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు నాడు–నేడు ద్వారా కనీవినీ ఎరుగని రీతిలో మారిపోయాయి. విద్యార్థులకు అవసరమైన తరగతి గదుల నిర్మాణం, బెంచీలు, అధునాతన టాయిలెట్లు, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు. జగనన్న గోరుముద్ద పేరుతో రోజూ ప్రత్యేక మెనూతో మంచి పుష్టికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. లక్షల రూపాయల ఫీజు కట్టే కార్పొరేట్ స్కూళ్లలో కూడా లేని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్స్(ఏఎఫ్‌పీ ప్యానల్స్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతోంది.

- శోభారాణి, మండల విద్యాశాఖాధికారి, ప్రొద్దుటూరు

షాపింగ్ మాల్‌లో భారీ అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదానికి గురైన ఆకృతి షాపింగ్ మాల్


షాపింగ్ మాల్‌లో కాలిన వస్త్రాలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొర్రపాడు రోడ్డులోని వివేకానంద హోల్‌సేల్ క్లాత్ మార్కెట్ పక్కన ఉన్న ఆకృతి షాపింగ్ మాల్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం లోపలి నుంచి పొగ రావడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. షాపులో నుంచి దట్టమైన పొగ బయటికి వస్తుండటంతో ముందు వైపు నుంచి లోపలికి వెళ్లేందుకు అగ్నిమాపక సిబ్బందికి సాధ్య పడలేదు. మొదటి అంతస్తులో వెనుక వైపున చిన్నపాటి ద్వారం ఉందని మాల్ యజమాని చెప్పడంతో అగ్నిమాపక సిబ్బంది షెటర్‌ను తొలగించి వెనుక వైపు గుండా లోపలికి ప్రవేశించారు. నలుగురు సిబ్బంది బీఏ సెట్ (ఆక్సిజన్ సెట్)సాయంతో లోపలికి ప్రవేశించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ప్రొద్దుటూరుతో పాటు మైదుకూరు, జమ్మలమడుగు ఫైర్ ఇంజిన్ల సిబ్బంది మంటలను అదుపు చేశారు. ల్యాడర్‌తో మొదటి, రెండో అంతస్తుల్లోకి వెళ్లిన సిబ్బంది పొగ బయటికి వెళ్లేందుకు వీలుగా అద్దాలను పగుల కొట్టారు. దుకాణ సముదాయంలో ఎంత మేర స్టాకు ఉందనే దానిపై అగ్నిమాపక అధికారులు షాపింగ్ మాల్ యజమాని తాండవ కృష్ణతో మాట్లాడారు.

పెద్ద మొత్తంలో నష్టం

అగ్నిప్రమాదంలో పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో మహిళలకు సంబంధించిన రెడీమేడ్ వస్త్రాలు ఉన్నాయి. అలాగే రెండో ఫ్లోర్‌లో జెంట్స్‌వేర్, చీరెలను ఏర్పాటు చేశారు. చాలా వస్త్రాలు కాలిపోగా పొగవ్యాప్తి కారణంగా మరింత ఎక్కువగా మసిబారి పోయాయి. మంటలు ఆర్పే క్రమంలో దుకాణంలోని వస్త్రాలన్నీ తడిసి ముద్దయ్యాయి. ఇవేవీ విక్రయించడానికి పనికి రావని నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే షాపు లోపల ఉన్న ఫర్నీచర్, సీలింగ్ పూర్తిగా దెబ్బతింది. కాగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు నిర్ధారించారు. అగ్నిప్రమాదంలో ఎంత మేర నష్టం జరిగిందనే దానిపై సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు.

పొగ పీల్చి లీడింగ్ ఫైర్‌మెన్‌కు అస్వస్థత

మంటలను ఆర్పే క్రమంలో పొగ పీల్చడం వల్ల లీడింగ్ ఫైర్‌మెన్ సాంబశివారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. స్థానిక అధికారి రఘునాథ్ వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కొన్ని గంటల తర్వాత ఆయన ఆరోగ్యం కుదుట పడినట్లు అధికారి తెలిపారు. కాగా జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు సహాయక చర్యలను పర్యవేక్షించారు. జమ్మలమడుగు అగ్నిమాపక అధికారి సత్యంరెడ్డి, మైదుకూరు ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి అధికారి చంద్రుడుతో పాటు 28 మంది సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

కడప అగ్రికల్చర్ : జిల్లాలో ప్రస్తుతం నాటిన వరినాట్లు చాలా చోట్ల ఎండుతున్నాయని దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు సూచించారు. అలాగే ముదిరిన నారును (36 రోజుల నుంచి 40 రోజుల నారును) నాటుకోవాలన్నారు. సోమవారం జిల్లాలోని వల్లూరు తదితర మండలాల్లో ఆయన సాగులో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పెద్దముడియం, రాజుపాలెం, ప్రొద్దుటూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, వల్లూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, కమలాపురం మండలాల్లో 25 –30 రోజుల వరి పంట ఎండిపోతోందన్నారు.

టీడీపీ నాయకులకు చుక్కెదురు


తలుపులు వేసిన ఇళ్ల వద్ద కనిపిస్తున్న టీడీపీ కరపత్రాలు

పులివెందుల టౌన్ : పులివెందులలో టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సోమవారం స్థానిక 4వ వార్డులో నిర్వహించిన బీటెక్ రవితో అడుగువేద్దాం అనే కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి చుక్కెదురైంది. టీడీపీ నాయకులు ప్రచారానికి వస్తున్నారన్న విషయం తెలుసుకున్న ప్రజలు తమ ఇళ్లకు తలుపులు వేశారు. బీటెక్ రవి తమ గడపకు రాకుండా నిరసన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల వీరాభిమానులమని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. అక్కడ ఉన్న స్థానికులను పిలిచి కరపత్రాలను తీసుకోవాలని పిలిచినా విముఖత చూపడంతో చేసేదీ మీలేక ఖాళీ ఇళ్ల వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలను వదిలేసి వెళ్లిపోయారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కడప అర్బన్ : కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల వారు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, కేన్సర్ కేర్ సెంటర్, కడపలో 68 పోస్టులకు నోటిఫికేషన్ నంబర్. 01/కంబైన్డ్/2024ను ఈనెల 24న విడుదల చేశారు. దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం దరఖాస్తు గడువును మూడు రోజులపాటు (ఫిబ్రవరి 2వ తేదీ వరకు) పొడిగించారు. దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలనీ కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఆంధ్రా జట్టు విజయభేరి

9 వికెట్ల తేడాతో ఛత్తీస్‌ఘఢ్‌పై విజయం


తలపడుతున్న ఆంధ్రా, ఛత్తీస్‌ఘడ్ జట్లు


5 వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్ వై.వాసు


7 వికెట్లు తీసిన చత్తీస్‌ఘర్ బౌలర్ దీపక్ యాదవ్

కడప స్పోర్ట్స్ : వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు అండర్-23 మల్టీడేస్ అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. రెండోరోజు సోమవారం 199 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 55.3 ఓవర్లలో 239 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ధరణికుమార్‌నాయుడు 88 పరుగులు, వై.వాసు 52 పరుగులు చేశారు. చత్తీస్‌ఘర్ బౌలర్లు దీపక్ యాదవ్ 7, వరుణ్‌సింగ్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చత్తీస్‌ఘర్ జట్టు 23 ఓవర్లకే 99 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆయుష్‌పాండే 26 పరుగులు చేశాడు. ఆంధ్రా జట్టు బౌలర్లు వై.వాసు 5, టి.విజయ్ 4 వికెట్లు చొప్పున తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు 2.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి విజయానికి అవసరమైన 13 పరుగులు చేసి 9 వికెట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. కాగా చత్తీస్‌ఘర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య


ఉరి వేసుకుని మృతి చెందిన బయమ్మ


ఆత్మహత్య చేసుకొన్న బడిగించెల దేవి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం మహాత్మానగర్ కాలనీ వెనుక భాగంలో నివాసం ఉండే వనం బయమ్మ (43) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎర్రగుంట్ల ఇన్‌చార్జి ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆయన కథనం మేరకు ఎర్రన్న, బయమ్మలకు ముగ్గురు సంతానం. వీరు కుటుంబంలో తరచూ గొడవలు పడుతుండేవారు. దీంతో బయమ్మ మనస్థాపానికి గురై ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఫ్యానుకు ఉరి వేసుకుని..

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన బడిగించెల దేవి (16) అనే యువతి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ మురళీ యాదవ్ కథనం మేరకు.. బీసీ కాలనీకి చెందిన బడిగించెల జగన్‌కు భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పదేళ్ల క్రితం భార్య చనిపోయింది. అప్పటి నుంచి బేల్దారి పనులు చేసుకుంటూ బిడ్డలను పోషించుకునేవాడు. ఇటీవల జగన్ మొదటి కూతురుకు వివాహం జరిపించాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. గమనించిన స్థానికులు తండ్రికి సమాచారం అందించారు. ఆత్మహత్యకు కారణం తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె సిటీ : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు టు టౌన్ ఎస్.ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మదనపల్లె పట్టణంలోని చౌడేశ్వరినగర్‌లో మూడో క్రాస్‌కు చెందిన తేజశ్విని(24)కి రాయచోటి పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఉప్పు శివకిషోర్‌తో వివాహమైంది. అదనంగా రూ.10 లక్షలు తేవాలని వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆర్టీపీపీ సీఈకి అభినందనలు


ఆర్టీపీపీ సీఈని సత్కరిస్తున్న వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల : విద్యుత్ ఉత్పత్తిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్న ఆర్టీపీపీ సీఈ నాగరాజును డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీ ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు అభినందించారు. గణతంత్ర దినోత్సవం రోజున ఏపీ జోన్ యాజమాన్యం నుంచి ఆర్టీపీపీ సీఈ నాగరాజు ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆర్టీపీపీలో ఇంజినీర్లు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు, కార్మికులు అభినందనలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీపీపీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్టీపీపీ సీఈ నాగరాజును పలు యూనియన్ల నాయకులు ఉద్యోగులు, ఇంజినీర్లు సత్కరించారు.